తియ్యని పిలుపు

– జి.బి.కాదంబరి దేవి

ఎందుకోగానీ ప్రొద్దున ఆరింటికి లేచినప్పటి నుండి నా దృష్టి టెలిఫోన్ మీదే. ఏ శబ్దం విన్నా ఫోన్ శబ్దంలానే వినబడుతోంది. ఇదంతా తెల్లవారు ఝామున వచ్చిన కల మూలంగా. కలలో అతను నవ్వుతూ నావంకే కన్నార్పకుండా చూస్తున్నాడు. అది తన ప్రత్యేకత. శబ్దాలు గొంతులో పలికించకుండానే, కళ్లతో భావాలను సందేశాలుగా మలచి నేరుగా హృదయంలోకి సంధించగలడు. అదే అతనిలో నాకు నచ్చే గుణం.

వారం రోజుల క్రితం అనుకోకుండా లక్ష్మి, మా దూరపు బంధువు వరసలో పెద్దమ్మ కూతురు, దాని పెళ్లిలో కనబడ్డాడు. స్వతహాగా ఎవరి గురించి పట్టించుకోని నా నిర్లక్ష్య వైఖరి తనకు నచ్చిందేమో. ఓ మూల ఒంటరిగా కుర్చీ మీద కూర్చున్న నా దగ్గరకు మజ్జిగ గ్లాసుతో వచ్చి, 'మేము ఆడ పెళ్లివారము, ఈ మజ్జిగ తీసుకోండి' అంటూ నా ఎదుట నిలబడ్డ అతన్ని మొదటిసారిగా చూశాను. కారణం ఆ గొంతులోని తీయదనం. ఉంగరాల జుత్తు, చామనఛాయ, టక్ చేసిన షర్టు, పాలిష్ చేసిన బూట్లు, పెదవులపై చిరునవ్వు వున్నా మనిషి గంభీరంగా కనిపించాడు. మామూలుగానైతే చేతి సైగతోనే వారించేదాన్ని. కానీ ఎందుకో గ్లాసు తీసుకోవడమే కాదు, మజ్జిగ మొత్తం త్రాగేశాను కూడా. ఖాళీ గ్లాసు ఎక్కడ పెట్టాలి అనుకుంటూ తల పైకెత్తి చూసేసరికి, అతను కనిపించలేదు. కాసేపు నా కళ్లు అతని కోసం పెళ్లి పందిట్లో నలువైపులా వెతికాయి. కానీ నిరాశే. నేను చేసిన ఈ పనికి నాకే నవ్వొచ్చింది. అది పెదవులపై చక్కగా ప్రస్ఫుటమవుతున్న సమయంలో, ప్రక్క నుండి 'ఏవిటో మీలో మీరే నవ్వుకుంటున్నారు? అయినా మీ చిరునవ్వు బావుంది' అంటూ అతను కనిపించగానే, మస్తిష్కంలోని వ్యక్తి, దృష్టి ముందుకు రాగానే, మెదడుకి, నోటికి సంబంధం తెగిపోయింది. ఈ రెంటినీ మళ్లీ సంధానించి జవాబిద్దామనుకునేంతలో మళ్లీ అదృశ్యమయిపోయాడు. ఇదేం విచిత్రమైన వ్యక్తి. ప్రశ్న వేసి, సమాధానం తెలుసుకోకుండానే వెళ్లిపోయాడే? అని మెదడు ఆలోచిస్తూ వుంటే, 'మీ చిరునవ్వు బావుంది' అన్న అతని సిన్సియర్ కాంప్లిమెంట్‌తో మనసు మురిసిపోసాగింది. అదేవిటో కానీ నాకు నచ్చని విషయాలపై నాకెంత నిర్లక్ష్యమో, నాకిష్టమైన విషయాలపై అంతటి దీర్ఘాలోచన. అందుకే చాలామంది నన్ను 'మూడీ' అని ముద్దుగా కాదు, అదో రకమైన కోపంతో పిలుచుకుంటారు.

'నువ్విక్కడ వున్నావా! పెళ్లిలో పది మందిలో గల-గల తిరిగితే కదా పదిమంది దృష్టి నీపైన పడి, 'ఫలానా పిల్ల పెళ్లి కెదిగింద'ని తెలుస్తుంది. నువ్విలా ఎవర్నీ అంటను, ముట్టను అని కూర్చుంటే చూడని వారు చూడరు సరికదా, చూసిన వాళ్లు అహంకార'ని దూరమవుతారు' అన్న అమ్మ మందలింపుతో ఆలోచనా లోకం నుండి ఇహ లోకంలోకి వచ్చాను. అయినా మౌనమే అమ్మకు సమాధానం. ప్రపంచంలో తల్లికంటే మనల్ని ఎవరూ సరిగ్గా అర్థం చేసుకోలేరేమో. మన ఇష్టాయిష్టాలు అమ్మ దగ్గర దాగవేమో. అందుకే 'పద భోంచేద్దాం' అంటూ తక్షణ కర్తవ్యాన్ని గుర్తు చేసింది. అదే మౌనంతో డైనింగ్ హాలు దగ్గరికి అమ్మతోబాటు నడిచాను. ఆ ప్రదేశాన్ని చూడగానే (అనిపించింది) ఆకలి ఎంతటి శక్తివంతమైందో తెలిసొచ్చింది. అక్కడ యాభై వసంతాల వారు సైతం ఐదేళ్ల వారితో పందెం వేసి, ఉరుకులు- పరుగులతో ప్లేట్ల యుద్ధం గెలిచి, భోజనాల లైనులో మధ్యలో దూరి, చెమటలు కారుతుండగా ఆ గుంపులో నుండి బైటకొచ్చి తింటున్న వాళ్ల హడావుడి చూసి ఆశ్చర్యమేసింది. ఇంతలో 'ఇదిగోండి' మళ్లీ అదే తీయని గొంతు, ఎంత పరిచయమైన గొంతు, కొద్ది నిముషాల వ్యవధిలోనే నా ఆలోచనలను తనదిగా చేసుకున్న గొంతు. మనసుకు ఎప్పుడు, ఏది, ఎందుకు నచ్చుతుందో. ఎవరికీ అంతుపట్టని మిస్టరీ. మనసుకు ఏది సంతోషాన్నిస్తుందో, ఎందుకు సంతోషాన్నిస్తుందో తెలుసుకోవడం కూడా ఓ మిస్టరీయే. ఆ గొంతు వినగానే

మనసులోని సంతోషం, కళ్లలో నుండి బయటికి దూకుతుండగా, చిరునవ్వుతో వెనక్కి తిరిగి చూశాను. ప్లేటులో చక్కగా రెండు పూరీలతో, రెండు రకాల కూరలతో, ఒక మిర్చి బజ్జి, ఒక స్వీటు, రా వెజిటబుల్ సలాడ్‌తో నీటుగా సర్ది తీసుకొచ్చాడు. 'నాకు తెలుసు. మీరు శాంతి ప్రియులని, యుద్ధం చేయరని' అంటూ చిలిపిగా నవ్వుతూ ప్లేటును అతని దగ్గరి నుండి తన దగ్గరకు తీసుకున్నాయి. నేనతన్ని చూస్తూనే వున్నాను, అదే నిశ్శబ్దపు చిరునవ్వుతో మళ్లీ అదృశ్యమయ్యాడు.

రెండు చేతుల్లో రెండు ప్లేట్లతో ఆయాసపడుతున్న అమ్మ 'నువ్వెప్పుడెళ్లి తెచ్చుకున్నావే! నీకోసం నేనవసరంగా కుస్తీ పడ్డాను' అంటూ ఒక ప్లేటును ప్రక్కనే వున్న సలాడ్ టేబుల్‌పై పెట్టింది. 'అతను తెచ్చాడమ్మా' అని చెబుదామనుకున్నాను, కానీ ఎందుకో మనసొప్పుకోవడం లేదు. అయినా అతనెవరంటే ఏమని సమాధానం చెబుతాను. ఒకవేళ చెప్పలేకపోతే అతన్ని వర్ణించాల్సొస్తుంది. ఆ వర్ణన భాషకందని భావనకే వుంటుందని అమ్మకు నచ్చజెప్పలేను. అందుకే మౌనంగా తినసాగాను. అమ్మ మళ్లీ ఏవో అడగాలనుకుంది. అంతలోనే

మా చుట్టాలావిడెవరో అమ్మను పలకరించడంతో ఆవిడతో బిజీ అయిపోయింది. నేను హాయిగా ఊపిరి తీసుకున్నాను. ఎందుకో అర్థం కావడం లేదు, అతన్ని గూర్చిన ఆలోచనలు, ఇతరులెవ్వరితో, చివరికి నా మంచి స్నేహితురాలైన అమ్మతో కూడా పంచుకోవాలనిపించడం లేదు. ఇలా ఆలోచిస్తూనే ప్లేటులో వున్నవన్నీ తినేశాను. 'ఇంకా ఏవన్నా తీసుకురానా' అంటూ ప్లేటు ప్రక్కనే వున్న బుట్టలో పెట్టేసి వాష్ బేసిన్ దగ్గరకు నడిచాను. అక్కడా భోజనాల దగ్గరున్న పరిస్థితే. అసలు మనుషుల్లో ఇంత తొందర దేనికో. మళ్లీ ఆలోచనలో పడ్డ నాకు, వెనక నుండి ఎవరో తోస్తే తూలిపడిపోయే నన్ను అమ్మ పట్టుకుంది. చివరికి అమ్మ సహాయంతో చేతులు కడుక్కున్నాను. వచ్చిన పని ఈ కార్యక్రమంతో సమాప్తమయింది కాబట్టి, ఇక బయలుదేరడమే తరువాయి. మనస్సంతా ఒక్కసారిగా చిన్నబోయింది. అతన్ని మళ్లీ చూడకుండానే వెళ్లాలా! పోనీ అతను మళ్లీ ఎప్పుడైనా కనిపిస్తాడా? ఒకవేళ కనిపించినా నన్ను గుర్తుపడతాడా? ఇంతకీ ఎవరతను? ఈ ప్రశ్నల శరపరంపరలతో మస్తిష్కం తట్టుకుందేమో గానీ, మనసు బాధపడసాగింది. అయినా చేసేదేమీ లేక అమ్మ వెంట మౌనంగా నడవసాగాను.

'మనస్విని'- అబ్బా! ఎంత తీయని పిలుపు. గిరుక్కున వెనక్కి తిరిగి చూశాను. కొద్ది దూరంలో అదే నిశ్చలమైన నవ్వుతో అతను. కాళ్లు వాటంతటవే అతని వైపు పరుగెడుతున్నాయి. మనస్సు ఓ రకమైన ఉద్విగ్నానికి లోనౌతోంది. 'ఎవరతనని అలా పరుగెడుతున్నావ్' అని వివేచన అడిగేలోపే అతని ఎదురుగా నేను. అదే చిరునవ్వుతో నన్ను చూస్తూ, షర్టు జేబులో నుండి ఒక పెన్ను తీసి, దేనికోసమో వెతకసాగాడు. కొద్దిసేపటి శ్రమానంతరం, ఒక పేపరు ముక్క బయటికి తీసి 'మీ ఫోను నెంబరు' అంటూ అడిగాడు. మంత్రముగ్ధలా గబా-గబా చెప్పేశాను. తను సిన్సియర్‌గా వ్రాసుకుని, తిరిగి అదే చిరునవ్వుతో నన్ను చూస్తూ, ఆ కాగితపు ముక్కను జేబులో వేసుకుని వెనక్కి తిరిగి వెళ్లిపోయాడు.

'మనస్విని-మనస్విని' అమ్మ పిలుపు. నేను వెనక్కి తిరిగి గబా-గబా అమ్మ దగ్గరికి నడిచొచ్చేశాను. 'ఎవరా అబ్బాయి? ఏం మాట్లాడుతున్నాడు? ఇంతకుముందే పెళ్లిలో చూసినట్టు లేదే!' అమ్మ ప్రశ్నలపై ప్రశ్నలు వేస్తోంది. మౌనమే నా సమాధానం. కారణం- నాకే తెలియవు ఆ ప్రశ్నలకు సమాధానాలు. ఇప్పుడు మొదలయింది వివేచన. నిజమే, అమ్మకొచ్చిన ఆలోచన నాకు రాలేదేం? ఓ అపరిచిత వ్యక్తికి ఫోను నంబరు కూడా ఇచ్చాను. నా బుద్ధికేవయింది. అవునూ- అతనికి నా పేరెలా తెలుసు. ఎలాగోలా తెలుసుకొనుంటాడు. తెలుసుకోవాలనుకున్నాడూ అంటే, అతనికి నేనంటే ఇష్టమా...? ఈ ప్రశ్నతో ఒక్కసారి తుళ్లిపడ్డాను. వెంటనే 'అతని సంగతొదిలేయి, నీ సంగతి చెప్పు' అని అడిగి నా మనసుకు జవాబు వెతికేలోపే- 'ఇంకా ఏవిటా ఆలోచనలు, ఆటో ఎక్కు' అని అమ్మ అనే వరకు, నా ముందు ఆటో వచ్చి ఆగింది కూడా గమనించలేదు. ఆలోచనలకు బ్రేక్ పడటంతో, అమ్మతో కలసి ఆటో ఎక్కి ఇంటికొచ్చాను. ఇది జరిగి వారం రోజులయింది. ఈ వారం రోజుల్లో ఒక్కసారి కూడా అతని దగ్గర నుండి ఫోన్ కాల్ రాలేదు. ఈ వారం రోజులు అతని గూర్చిన ఆలోచనే, అతన్ని- నన్ను పరీక్షించుకోవడమే. అతని నుండి ఏమి ఆశిస్తున్నానో అంతుపట్టడం లేదు. కానీ అతని గూర్చిన ఆలోచన ఓ మధురానుభూతి నిస్తోంది. ఇది అతనంటే ఇష్టమా? లేక ప్రేమా? లేక వ్యామోహమా? కాదు... కాదు... వ్యామోహమైతే కాదు. ఒకసారి మాటల సందర్భంలో నాన్నగారన్నారు- 'ఎవరి చెంత మనసు ప్రశాంతతను పొందుతుందో, వారే నిజమైన స్నేహితులు' అని. అయితే అతను నా స్నేహితుడా? నా మనస్సు అతని స్నేహాన్ని కోరుతోందా? ఏమో మరి. 'ఒసేయ్ మనస్వినీ! ఏం చేస్తున్నావే, ఫోను శబ్దం వీధిలో వాళ్లందరికీ వినిపించింది, అక్కడే కూర్చున్నావు కదా, కాస్త ఫోను తీయి'- అమ్మ కేకతో ఫోను శబ్దం ఫైరింజనులా వినబడసాగింది. ఫోను తీసి హలో అన్నాను. అటువైపు నుండి 'మనస్వినీ! ఎలా వున్నారు!' అదే తీయని గొంతు. పంజరంలో నుండి బయటపడిన విహంగంలా నా మనసు సంతోషాకాశంలో హాయిగా ఎగరసాగింది. ○